

సాంప్రదాయ సామూహిక నృత్యం..
కోలాటం
● ప్రాచీన ఆటపై పలువురి ఆసక్తి
● చిన్నారులకూ శిక్షణ
● ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న మహిళల ప్రదర్శనలు
7

సీఎంకు పోస్టుకార్డులు



సీఎంకు పోస్టుకార్డులు పంపిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు శనివారం పోస్టు కార్డులు రాసి సీఎంకు పోస్టు చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన 8500 కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, కార్తీకర్, వంశీ, మానస, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి మహిళలకు క్రీడాపోటీలు

శ్రీరాంపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీన నస్పూర్ మనోరంజన్ సముదాయంలో, 5వ తేదీన శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ పోటీలుంటాయన్నారు. అలాగే ఉద్యోగినులకు బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ పోటీలు ఈ నెల 6వ తేదీన జీఎం కార్యాలయం ఎదుట ఉన్న కేంద్ర నర్సరీలో, అదే రోజున బంగ్లాస్ ఏరియాలో ఉన్న మహిళలకు బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, బాల్ ఇన్ ది బాస్కెట్ పోటీలు ఎల్లందు క్లబ్‌లో ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన బహుమతులు అందిస్తామని, మహిళలు పెద్ద ఎత్తున ఆయా పోటీల్లో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

● ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ప్రభుత్వం పచ్చ జెండా
● ఐదేళ్లుగా పెండింగ్‌లో 15వేల పై చిలుకు దరఖాస్తులు
● క్రమబద్ధీకరణకు మరో రెండు నెలలు పట్టే అవకాశం



రాయితీతో మోక్షం లభించేనా?

మంచిర్యాల, మార్చి 1(ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) మళ్లీ తెరపైకి రావడంతో ఈసారైనా రిజిస్ట్రేషన్లకు మోక్షం కలుగుతుందా అనే సంశయం ప్రజల్లో నెలకొంది. రెగ్యులరైజేషన్ కోసం దాఖలైన దరఖాస్తులకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25శాతం రాయితీ ఇస్తూ చేసిన ప్రకటనతోనైన సమస్యలకు పరిష్కారం లభిస్తుందా...? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తొలనుంచి ఎల్ఆర్ఎస్ అమలు ప్రక్రియ అనేక ఒడిదుడుకుల మధ్య నత్త నడకన సాగుతుంది. పథకం అమలు విషయంలో ప్రభుత్వాలకు స్పష్టత లేకపోవడం, నిబంధనలను ఎప్పటికప్పుడు మార్చుతుండడం, శాఖల మధ్య సమన్వయలోపం దరఖాస్తుదారులకు శాపంగా మారుతోంది.

ఆ బృందాలు ఏమయ్యాయి..?

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించనున్నట్లు గత సంవత్సరం జూలైలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపాలిటి, రెవెన్యూ, నీటి పారుదలశాఖ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులతో ఈ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బృందాలు క్షేత్ర స్థాయిలో దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించింది. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. కాని ఇదీ ఆచరణకు నోచుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఈ నెల 31లోపు ఎల్ ఆర్ఎస్ దరఖాస్తు చేస్తే 25శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనధికారిక లేఅవుట్లలో కేవలం పదిశాతం ప్లాట్లు, రిజిస్టర్ అయి ఉండి, మిగిలిన రిజిస్ట్రేషన్ కాకపోతే 90శాతం ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతించాలని కూడ నిర్ణయం తీసుకుంది.

ఇందులో ప్రత్యేకత ఏమి లేకపోగా ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టినప్పుడే ఈ అవకాశం వినియోగదారులకు ప్రభుత్వాలు కల్పించాయి. దీంతో చాలా మంది రియల్టర్లు, అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొన్న వారు మొదట్లో రూ.10వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తరువాత రూ. 1000 చొప్పున వసూలు చేశారు. అయినా క్రమబద్ధీకరణ జరుగ లేదు. ప్లాటు కొనుగోలుకు సంబంధించిన సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ ఉన్న వాటికి కూడా 25 శాతం రాయితీ ఇస్తున్నట్లు తాజాగా ప్రభుత్వం చేసిన ప్రకటన కొంత ఉపశమనం కలిగిస్తోంది. కానీ గతంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా దరఖాస్తుదారుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు.

ఆశతో కొనుగోలు చేస్తే...

జిల్లాలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో వేలాది మంది వాటిని కొనుగోలు చేశారు. లేఅవుట్ లేని ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో ప్లాట్ల యజమానుల పరిస్థితి దయనీయంగా మారింది. దుస్థితిని తొలగించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చి దరఖాస్తులను సైతం ఆహ్వానించింది.

దీంతో రూ. 10వేల చొప్పున చెల్లించి ప్లాట్ల యజమానులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో క్రమ బద్ధీకరణ నిలిచిపోయింది. దరఖాస్తు చేసుకున్న వారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా ఆశించిన మేరకు క్రమ బద్ధీకరణ జరుగలేదు. తరువాత 2020 ఆగస్టులో ప్రభుత్వం మరో జీవో తెచ్చింది. ఇందులో ప్లాట్లకు సంబంధించి రూ. వెయ్యి చొప్పున చెల్లించేందుకు అవకాశం కల్పించారు. క్రమబద్ధీకరణకు స్థలం విలువ లెక్కింపునకు ప్రభుత్వం స్లాబ్‌ల వారిగా ధరలు నిర్ణయించారు. ఈ మేరకు మార్గదర్శకాలను కూడ జారీ చేసింది.

ఎల్ఆర్ఎస్ చార్జీలు తగ్గిస్తూ 2020లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. చదరపు గజం ఆధారంగా క్రమబద్ధీకరణ కోసం చార్జీల స్లాబ్‌ల సంఖ్యను పెంచింది. నిర్దేశించిన ఖాళీ స్థలాలు వదలని చోట్ల చెల్లించాల్సిన రుసుం రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించే ధరను ప్రాతిపదికగా చేసింది. ప్రత్యేకంగా నాల చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ఈ క్రమబద్ధీకరణ పథకం జీవో 111 ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అప్పట్లోనే ప్రారంభమైంది. ఈ మేరకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు కూడ జారీ అయ్యాయి. అయితే పలు కారణాల వల్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

ప్రభుత్వానికి భారీ ఆదాయం...

ప్రభుత్వం తాజా నిర్ణయం ప్రకారం 25శాతం రాయితీ కల్పిస్తే దరఖాస్తు దారుల సంఖ్య పెరిగి ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలోని 6మున్సిపాలిటీలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో అనధికార లేఅవుట్లు అధికంగా ఉన్నందున..

మిగతా 7వ పేజీలో

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 5 నుంచి 25 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయతో నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రథమ సంవత్సరంలో 4,965 మంది జనరల్, 935 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 5,625 మంది జనరల్, 1015 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్‌లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నాపత్రాలు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా



లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలోని ఇంటర్ విద్యార్థుల నృత్యాలు

దండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిసాం. చదువులమ్మ చెట్టు నీడలో.. విడలేమంటూ వీడుకోలంటూ అంటూ వెళ్లిపోతున్నము జూనియర్ కళాశాల విద్యార్థులు సీనియర్ విద్యార్థులతో పాటల నృత్యాలతో హోరెత్తించారు. దండేపల్లి మండలం లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్ విద్యార్థులు నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో సెకండియర్ విద్యార్థులు పోటీ పడి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రామగిరి రమేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకం

రామగుండం సీపీ శ్రీనివాస్



జాగిలాలతో రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, మార్చి1(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో జాగిలాల పాత్ర కీలకమని రామగుండం పోలీసు కమిషనర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. శనివారం రామగుండం పోలీసు కమిషనరేట్‌కు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమిలో ఏడాదిపాటు శిక్షణ పొందిన 24వ బ్యాచ్‌కు చెందిన జాగిలాలను తీసుకరావడం జరిగింద న్నారు. అందులో మూడు జాగిలాల్లో నార్కోటింగ్ డాగ్ జెస్సీ గంజాయి మత్తు పదార్థాల గుర్తింపులో స్లీపర్ డాగ్ రైడర్, ఎక్స్‌ప్లోజీవ్ గుర్తింపులో ట్రాకర్ డాగ్ టైసన్‌లను తీసుకొచ్చామని తెలిపారు. వివిధ రకాల నేరాలకు పాల్పడిన నిందితులను గుర్తించడంలో ఇది సంవత్సర కాలం తీసుకుందన్నారు. కమిషనరేట్ పరిధిలో నేరం జరిగిన పరిసరాల్లో వాసన చూసి నిందితులను, అనుమానితులను, నేరస్థులను త్వరగా గుర్తించడానికి ఈ జాగిలాలు ఉపయోగపడుతాయన్నారు. చట్ట విరుద్ధ కార్యాకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి పట్టుకోవడంలో, డ్రగ్స్, గంజాయి, బాంబులను గుర్తించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం, సంపత్, సీపీ హరీశ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు న్యాయం చేయాలి

చెన్నూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం చెన్నూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు మాదిగ జాతి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఎస్సీ వర్గీకరణలో మాదిగ జనాభా ప్రకారం 32,33,642 మంది ఉండగా తమకు రావాల్సిన రిజర్వేషన్ 11 శాతం అయితే 9 శాతం రిజర్వేషన్ ప్రకటించారని, ఇది మాదిగ జాతికి అన్యాయం చేయడమే అవుతుందన్నారు. ఈ విషయంపై మందకృష్ణ మాదిగ సీఎంతో చర్చించారని, స్పందించిన సీఎం ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌తో పిలిచి లోపాలను సవరించి మార్చి 10లో కమిషన్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చెక్కినారపు మల్లేష్ మాదిగ, శ్రీనివాస్‌మాదిగ, మల్లేష్ మాదిగ, ప్రసాద్, మల్లేష్, నారాయణ పాల్గొన్నారు.

బెల్లంపల్లి : మాదిగ జాతి కోసం వీరమరణ పొందిన అమరులకు శనివారం బెల్లంపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగ అమరవీరుల త్యాగం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ పాల్గొన్నారు.

జన్నారం : జన్నారం మండల కేంద్రంలో శనివారం మాదిగ అమవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలను సైతం లెక్క చేయని అమరులను స్ఫూర్తిగా తీసుకోవా లన్నారు. మండల అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు పాల్గొన్నారు.



బెల్లంపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

లక్సెట్టిపేట: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం దళిత అమరవీరులను నాయకులు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆవునూరి ప్రసాద్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మురళికృష్ణ, సీనియర్ నాయకుడు చిప్పకుర్తి నారాయణ, ఆవునూరి లచ్చన్న, ముల్కల్ల రాందాస్, గౌరవ అధ్యక్షుడు తోటపల్లి మహేందర్, పట్టణ అధ్యక్షుడు విక్రమ్ పాల్గొన్నారు.

దండేపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అసువులు బాసిన మాదిగ అమర వీరుల త్యాగలను స్మరించుకోని వారి ఆశయ సాధన కోసం మనం ముందుకు సాగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ అన్నారు. దండేపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబెద్కర్ విగ్రహం వద్ద శనివారం సంఘ నాయకులతో కలిసి మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళ్లర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షకార్యదర్శు మంతెన నవీన్‌మాదిగ, శ్రీనివాస్, సంఘం నాయకులు వినయ్, నరేష్, సత్తయ్య, శంకర్, మల్లేష్ పాల్గొన్నారు.

మానవాళి పరిరక్షణలో పక్షుల పాత్ర ప్రధానం

-ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ సువర్ణ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ సువర్ణ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పక్షులు జీవ వైవిధ్యంతో పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మానవాళికి మేలు చేస్తు న్నాయని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు డాక్టర్ సువర్ణ అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అటవీశాఖ, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కవ్వాల్ బర్డ్ ఫెస్టివల్ కార్యక్ర మంలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, కలెక్టర్ కుమార్ దీపక్, సీసీఎఫ్ శరవణన్, జిల్లా అటవీ శాఖ అధికారులు శివ్ ఆశిష్‌సింగ్, నీరజ్‌కుమార్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ పర్యావరణంలో పక్షుల ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ఈ నేపథ్యంలో బర్డ్ ఫెస్టివల్ వర్క్‌షాపులు దోహదపడతాయని తెలిపారు. పక్షుల సంరక్షణ ఒక అలవాటుగా మార్చుకోవాలన్నారు. హైద్రాబాద్ వంటి నగరాల్లో కాకులు చాలా వరకు అంతరించిపోయాయని, రాష్ట్ర పక్షి అయిన పాలపిట్టను దసరా పర్వదినాల్లో బంధించి చూడడం నేర మని, సహజ సిద్దంగా చూడాలన్నారు. కొన్ని పక్షులు వేటగాళ్ల బారిన పడి అంతరించిపోతున్నాయన్నారు. బర్డ్ ఫొటోగ్రఫీలో పక్షుల ప్రతి కదలికలను గమనించి వాటి జీవన విధానాన్ని తెలుసుకుంటామని, ఈ క్రమంలో జీవితంలో పక్షుల అవసరం తెలుసుకుంటారని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లా అధిక మొత్తంలో అటవీ ప్రాంతం కలిగి ఉందని, జిల్లాలోని అడవుల్లో అనేక రకాల పక్షి జాతులు జీవిస్తున్నాయని తెలిపారు. విద్యాసంస్థల్లో విద్యార్థులను చారిత్రాత్మక ప్రదేశాలకు తీసుకెళ్లి విజ్ఞానం కల్పించడంతో పాటు జీవ వైవిధ్యంలో పక్షుల ప్రాముఖ్య తపై విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం జిల్లాలోని కవ్వాల టైగర్ రిజర్వులో సంచరించే వివిధ రకాల పక్షులతో కూడిన బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బర్డ్ స్టడీస్ (రిషివాలీ) డాక్టర్ శాంతారాం, వెట్‌లాండ్స్ ఎక్స్ పర్ట్ గుజ్జా బిక్షం, బర్డ్‌మైగ్రేషన్ స్టడీస్ ప్రముఖులు సాతియా సెల్వం, హైద్రాబాద్ బర్డింగ్‌పాల్స్ ఎన్‌జీవో సీతారాంరెడ్డి, రాబిన్ విజయన్, మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌రావు, వైల్డ్‌లైఫ్ అధికారులు ఫరీదా తంపాల్, రాజేశ్వర్, అటవీ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రాజెక్టర్ ద్వారా పక్షుల గురించి వివరిస్తున్న అటవీశాఖాధికారి

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి

జైపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలను పద్మశాలీ కులస్తులు విజయవంతం చేయలని తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిలువేరు సదానందం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వేముల మల్లేష్‌తో కలిసి మాట్లాడారు. హైద్రాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న నిర్వహించే మహాసభలకు పద్మశాలీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాజకీయంగా పద్మశాలీలు ఎదగాలని, ఇందుకు అందరు ఐక్యం కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో పద్మ శాలి సంఘం నాయకులు దుస్స భూమన్న, ఆవిడపు గణేష్, శంకర్, బూమయ్య, రాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీరాంపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామానికి చెందిన నిమ్మరాజుల సతీష్(32) శనివారం బంధువులు ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 వాహనంలో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనం తరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు తెలిసింది.

కొత్త లేబర్ కోడ్‌లతో ప్రమాదం



సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి

కాసిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త లేబర్ కోడ్‌లతో కార్మిక సంఘాలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి అన్నారు. శనివారం కాసిపేట 2వ గనిలో నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాలను నిర్వీర్యం చేసి బొగ్గు బావుల్లో సైతం రాజకీయ జోక్యం పెంచేందుకు కుట్రలు పన్నుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల మనుగడకు ప్రమాదం వాటిల్లకముందే యూనియన్‌లన్నీ తమ సిద్ధాంతాలను పక్కనబెట్టి సంస్థను యూనియన్‌ల వ్యవస్థలను భవిష్యత్ తరాలకు సజీవంగా అందించేందుకు తరలి రావాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థలో పెరిగిన రాజకీయ జోక్యం వల్ల సంస్థ ఎటు తేల్చుకోలేక అవస్థలు పడుతుందన్నారు. ఆర్థికంగా నష్టాల్లోకి పోయి కాయిలా పరిశ్రమగా మారకముందే గుర్తింపు సంఘం అన్ని యూనియన్‌లను సమన్వయం చేసుకుంటూ పోరాటానికి రూపకల్పన చేయాలని కోరారు. కొత్తగా వచ్చిన లేబర్ కోడ్‌ల కలిగే ప్రమాదాలను కార్మికులకు వివరిస్తూ కార్మికవర్గాన్ని చైతన్యవంతం చేయాల్సిన అవసరం యూనియన్‌లపై ఉందన్నారు. ఇందుకు అన్ని కార్మిక సంఘాలు ఏకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకటస్వామి, అల్లి రాజేందర్, పిట్ సెక్రటరీ సురేష్, ధీరజ్, రాజేష్, వంశీకృష్ణ, యశ్వంత్, స్వామి , శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు వంద శాతం పనులు కల్పించాలి

జైనూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో కూలీలకు వంద శాతం పనులు కల్పించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. గ్రామ పంచాయతీల వారీగా కూలీలు వంద శాతం పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీల వారిగా కొనసాగుతున్న పనుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏపీవో నగేష్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

కెరమెరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోతో కలిసి కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలు లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రతి రోజు నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శులు బొజ్జిరావు, సతీష్, ఈశ్వర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షలు ప్రారంభం



భక్తులకు మాలధారణ చేస్తున్న అర్చకుడు శిరీష్‌శర్మ

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఏప్రిల్ 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శనివారం 25 మంది భక్తులు 41 రోజుల పాటు మండల దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి అభిషేకం, నవగ్రహ స్థాపన పూజ, మన్యు సూక్తం, ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మాలధారణ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకన్న, వివేక్, మధు, నారాయణ మూర్తి, సుధాకర్, జీవన్, తేజ, యాదగిరి, కృపాల్, సురేష్, స్వాములు పాల్గొన్నారు.

సర్కారు బడిలో ట్యాబ్ పాఠాలు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు అందజేత

మొదటి విడతలో పది స్కూళ్లకు మంజూరు

PM SHRI

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో ట్యాబ్‌తో పాఠాలు చెప్పేందుకు కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక విద్య ప్రతీ విద్యార్థికి అవసరమే. ఇందులో భాగంగా సర్కారు పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. మొదటి విడతలో ఎంపికైన పీఎంశ్రీ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు నిర్ణయించింది. విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బోధన చేయనున్నారు. ఉపాధ్యాయులు బోర్డుపై బోధించే అంశాలను నేరుగా చూసేలా అవకాశం కల్పించనున్నారు. ఇందుకోసం ఎంపికైన ఒక్కో పాఠశాలకు 25 ట్యాబ్‌లను త్వరలో సరఫరా చేయనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జిల్లాలో 18 పాఠశాలలు..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పీఎం శ్రీ పథకానికి రెండు విడతల్లో 18 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో మొదటి విడతలో ఎంపికైన 10 పాఠశాలలకు ప్రస్తుతం ట్యా బ్‌లు మంజూరయ్యాయి. ఒక్కో పాఠశాలకు 25 చొప్పున 250 ట్యాబ్‌లు మంజూరయ్యాయి. వీటిని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు అందించి పాఠ్యాశా లకు సంబంధించిన అంశాలను అనుమానాలను నివృత్తి చేసేలా బోధన చేయనున్నారు.

విద్యార్థులకు మెరు గైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు బోధకులకు దీని వినియోగంపై అవగాహన కల్పించారు. పేద విద్యార్థులు అన్నింట్లోనూ కార్పొరేట్‌లో చదివిన వారితో పోటీ పడేలా తీర్చిదిద్దడమే ధ్యేయమని విద్యా శాఖ అధికా రులు చెబుతున్నారు.

వార్డుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

క్రాంతి, మున్సిపల్ కార్యాలయం మేనేజర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: వార్డుల్లో సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు ఏంటి?

మేనేజర్: పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం 30 వార్డులకు ప్రత్యేకాధికారులను నియమించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. వార్డులో ప్రత్యేకాధికారులు పర్యటించి గుర్తించిన సమస్యలను కమిషనర్ సూచనల మేరకు పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఆస్తి పన్ను వసూళ్లకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

మేనేజర్: మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తి పన్ను వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నాం. పెండింగ్ బకాయిల జాబితా రూపొందించి నోటీసులు జారీ చేశాం. పన్నుల ద్వారా వసూలు అయ్యే నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతాయని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

మేనేజర్: పట్టణంలోని 30 వార్డులో తాగునీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలోనూ ఇబ్బంది కలుగకుండా నీటి సరఫరా కొనసాగిస్తాం.

-కాగజ్‌నగర్ టౌన్ (ఆంధ్రజ్యోతి)

బైండోవర్ ఉల్లంఘన కేసులో ఒకరికి లక్ష జరిమానా

దండేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన గోలి రమేష్ అనే వ్యక్తికి బైండోవర్ ఉల్లంఘించిన కేసులో లక్ష రుపాయాల జరిమానా విధించామని లక్షెట్టిపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ ఎస్ సమ్మయ్య తెలిపారు. గతంలో రమేష్ వద్ద నాటుసారాకు సంబంధి న బెల్లం, పట్టిక దొరకడంతో అతడిని ఎక్సైజ్ శాఖ అధికారులు దండేపల్లి తహసీల్దార్ సంధ్యరాణి ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ నాటుసార తయారు చేసే వారికి బెల్లం, పట్టిక అమ్ముతూ మళ్లీ పట్టుబడగా అతనిపై కేసు నమోదు చేశారు. బైండోవర్ ఉల్లంఘించినందుకు గాను దండేపల్లి మండల తహసీల్దార్ సంధ్యారాణి ఎదుట రమేష్‌ను హాజరుపర్చారు. తహసీల్దార్ అతడికి నోటీసులు జారీ చేసి లక్ష రుపాయల జరిమాన కట్టించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ ఎస్సై జి మౌనిక, సిబ్బంది ఇస్పాత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్, వెంకటేష్, శిరీషల పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ఆసిఫాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా చేపట్టాలని హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పీవో, హౌసింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో పేర్లు ఉన్న లబ్ధిదారుల త్వరగా బేసిమెంట్ నిర్మాణాలను చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించి నిర్మాణాలు చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. బేసిమెంట్ నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి త్వరగా నిధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాల న్నారు. ఎల్1, ఎల్2 జాబితాలపై సర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, హౌసింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

శిథిలావస్థలో విశ్రాంత భవనం

దండేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం లింగాపూర్‌లో 1934వ సంవత్సరంలో ఎంతో మంది ప్రముఖులకు బస కల్పించిన ఆర్‌అండ్‌బి(రోడ్డు భవనాల శాఖ) అతిథి గృహం నేడు వెలవెల బోయి, ఇప్పుడు శిథిల బంగ్లాగా మారింది. దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలోని నిజాం కాలం ప్రభుత్వ హయాంలో గత 91 ఏళ్ల క్రితం నిర్మించిన విశ్రాంత భవనంలో అప్పట్లో ఎంతో మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నత శాఖల అధికారులు ఇక్కడ బస చేశారు. లక్షెట్టిపేట-ఆదిలాబాద్-నిర్మల్ ప్రధాన రహదారు ల సమీపంలో లింగాపూర్‌లో అతిథి గృహం నిర్మించారు. గెస్ట్‌హౌజ్‌కు సంబంధించి సు మారు రెండు, మూడెకరాల స్థలం కూడా ఉండటం విశేషం. ఏళ్ల క్రితం నిర్మించిన అతిథి గృహంపై పాలకులు పట్టించుకోకపోవడంతో ఆదరణ కరువై ఇప్పుడు పూర్తిగా శిథిలమువుతుంది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అతిథి గృహాన్ని తెలంగాణ క్రీడ ప్రాంగణం ఏర్పాటు చేసింది. దీనికి తోడు గెస్ట్‌హౌజ్ ఆవరణలో గ్రామ పంచాయతీ నర్సరీని కూడా ఏర్పాటు చేసింది. గతమెంతో ఎంతో మంది ప్రముఖులకు ఉపయోగపడిన విశ్రాంత భవనం నేడు పూర్తిగా శిథిలమైన్న దుస్థితి నెలకొంది.



శిథిలావస్థకు చేరిన విశ్రాంతి భవనం

వేర్వేరు చోట్ల రెండు బైక్‌లు చోరీ

మంచిర్యాలక్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో వేర్వేరు చోట్ల రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి. మంచిర్యాల పట్టణం ఇందిరానగర్‌కు చెందిన ఎలగం సాయినాథ్ ద్విచక్రవాహం చోరీకి గురైనట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయినాథ్ తన ఇంటి ముందు బజాజ్ పల్సర్ టీఎస్19ఎఫ్ 6647 గల వాహనాన్ని ఇంటి ముందు పార్కు చేసి ఇంటిలోకి వెళ్లాడు. తిరిగి సాయంత్రం బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మంచిర్యాల పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన కొంగ సాయినాథ్ మోటార్ సైకిల్ టీఎస్ 19డి 8983 ను చోరీకి గురైనట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సాయినాథ్ ఫిబ్రవరి 27న మధ్యాహ్నం తన మోటా ర్‌సైకిల్‌ను ఫారెస్టు కార్యాలయం పక్కన పార్కు చేశాడు. తిరిగి వచ్చి చూసే సరికి వాహనం కనిపించ లుదు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విరగబూసిన మోదుగ



వాంకిడి/చింతలమానేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వాంకిడి, చింతలమానేపల్లి మండలా ల్లో మోదుగు చెట్లు విరగబూశాయి. గతంలో హోలీ సందర్భంగా సహజ సిద్ధంగా లభించే మోదుగ పూలతో రంగులు తయారు చేసి చల్లుకునే వారు. రెండు దశాబ్దాల కిందట సహజ సిద్ధమైన, సంప్రదాయ రంగులతోనే హోలీ నిర్వహించుకునే వారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వాంకిడి నుంచి కనర్ గాం, రోహినిగూడ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పూసిన మోదుగు పూలు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాయి. చింతలమానేపల్లి నుంచి గూడెం వైపు వెళ్లే రహదారిలోనూ ఇరువైపులా మోదుగ పూలు విరగ బూసి ఉండడంతో వాహనదారులు ఆసక్తిగా చూస్తున్నారు.

పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పద్మశాలీలు ఐక్యంగా ముందుకు సాగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల ఆంజనేయులు అన్నారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని ఎగ్జిబీషన్ గ్రౌండ్‌లో నిర్వహించే 17వ అఖిల భారత పద్మశాలి మహాసభ, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలకు సంబందించిన కరప్రతాలను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో రాజయ్య, వెంకటేష్, కనకయ్య, శంకర్, శ్రీకాంత్, లింగయ్య, తిరుపతి, రవీందర్, మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సింగరేణి సమాచారం

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీ, అధ్యక్షుడు బుర్ర తిరుపతి, సహాయ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ నేతృత్వంలో శనివారం సీఎండీ ఎన్. బలరాంను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ హై పవర్ కమిటీ వేతనాలు, జీవో 22 ప్రకారం వేతనాలు అందించాలన్నారు. కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. చట్ట ప్రకారం పండుగల సెలవులు, సిక్ లీవులు, సాధారణ సెలవులు మంజూరు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

క్రీడాకారులకు సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో పని చేస్తున్న ఇద్దరు క్రీడాకారులను ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఓసీపీ కార్యాలయంలో ఆఫీస్ అటెండెంట్‌గా పనిచేస్తున్న షేక్ తాజుద్దీన్ రాంచీలో గత నెల 3, 4 తేదీల్లో జరిగిన కోల్ ఇండియా క్యారమ్స్ పోటీల్లో సింగరేణి జట్టు పక్షాన పాల్గొని చాంపియన్‌షిప్ సాధించేందుకు పాటుపడ్డాడు. జనరల్ మజ్దూర్ బెల్లం తిరుపతి గతేడాది భూపాలపల్లిలో నిర్వహించిన హాకీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించారు. వారిద్దరిని పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియాలో 111 శాతం బొగ్గు ఉత్పత్తి



శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో గత నెలలో 111శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ అన్నారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనుల్లో ఆర్‌కే 5 గని 102 శాతం, ఆర్‌కే 6 గని 104 శాతం, ఆర్‌కే 7 గని 84 శాతం, ఆర్‌కే న్యూటెక్ గని 112 శాతం, ఎస్‌ఆర్‌పీ 1 గని 73 శాతం, ఎస్‌ఆర్‌పీ 3, 3ఏ గని 81 శాతం ఉత్పత్తి సాధించాయన్నారు. ఉపరితల గనుల్లో శ్రీరాంపూర్ ఓసీపీ 146 శాతం, ఇందారం ఓసీపీ 60 శాతం బొగ్గును వెలికితీశామన్నారు. ఏరియాలో మొత్తం 5 లక్షల, 30 వేల 500 మెట్రిక్ టన్నుల లక్ష్యం కాగా, 5 లక్షల, 90 వేల 533 మెట్రిక్ టన్నులు ఉత్పత్తిని వెలికి తీసినట్లు చెప్పారు. అంతేకాకుండా శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అరవింద రావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంపల్లి ఏరియాలో ..

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గనుల్లో 132 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖైరిగూడ ఓపెన్ కాస్టులో ఫిబ్రవరి నెలలె 3.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 4.09లక్షల టన్నులు వచ్చినట్టు వివరించారు. వార్షిక సంవత్సరంలో ఇప్పటి వరకు 33.30 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గానూ 32.07లక్షల టన్నుల ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పాటుపడ్డారని తెలిపారు. సమావేశంలో ఎస్‌ఓటు జీఎం కె రాజమల్లు, పర్సనల్ మేనేజర్ ఆర్ తిరుపతి, ఐఈడీ ఉజ్వల్ బెహర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

పెంచికలపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఉమ్మడి జిల్లా డీసీఈబీ మాజీ కార్యదర్శి శంకరయ్య అన్నారు. శనివారం మండలంలోని చెడ్వాయి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పరీక్షలు రాయడంలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రాకేష్, సంతోష్‌కుమార్, తాజ్‌పాషా, రాజకమలాకర్‌రెడ్డి, శిల్ప, ధృపతాబాయి, సుమిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి అధికంగా నిధులు కేటాయించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి శనివారం పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తిరుపతి, లెనిన్, సుశాంత్, తేజ, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మహిళకు పీహెచ్‌డీ పట్టా

బెల్లంపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీకి చెందిన శంకరజ్యోతి ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందింది. శంకర జ్యోతి వాణినికేతన్ పాఠశాలలో ప్రాథమిక విద్యను, ప్రగతి కళాశాలలో ఇంటర్, మంచిర్యాలలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, హైద్రాబాద్‌లోని సంహిత పీజీ కళాశాలలో పీజీని అభ్యసించింది. గణితంలో ఇబ్బందులు పడే వారికి అర్థమయ్యే విధంగా చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా సాధించింది. తాను ఈ స్థాయికి రావడానికి తన తల్లిదండ్రులు పద్మావతి, సోమిరెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ గణిత విభాగం ప్రొఫెసర్‌లు, కుటుంబీకుల సహకారమని పేర్కొంది.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

లక్షెట్టిపేట రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన గ్రామ కమి టీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆవునూరి కమలాకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి రాజేష్ మాదిగ, ఉపాధ్యక్షులుగా చంద్రయ్య, రాజ య్య, కోశాధికారిగా సంతోష్ మాదిగ, సహాయ కార్యదర్శిగా చిప్పకుర్తి చం ద్రయ్య, రత్నయ్య, శేఖర్‌లను ఎన్నుకున్నారు. వీరికి గౌరవ అధ్యక్షులుగా చాతరాజు రమేష్ మాదిగను నియమించారు. వీరితో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పేదలకు కంటి పరీక్షలు

కోటపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) :కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శంకర్‌పూర్, శెట్‌పల్లి, బావనపల్లి, పంగిడిసోమారం గ్రామాల్లో శనివారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మంచిర్యాలకు చెందిన పవన్ ఆప్టికల్స్ సహకారంతో కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 43 మందిని గుర్తించి వారికి కంటి శస్త్ర చికిత్సలు చేయాలని సూచించారు. గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు జరిపి మందులు అందజేసి కోటపల్లి పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కంటి పరీక్ష శిబిరాలను కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్ సందర్శించారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేత

దండేపల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో ఆర్య వైశ్య సంఘం మండల సలహారుడు గౌరిశెట్టి శ్రీనివాస్ సొంత ఖర్చుతో శనివారం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులను అందజే శారు. శ్రీనివాస్‌ను పాఠశాల ఉపాధ్యా యులు, గ్రామ నాయకులు అభినందించారు.

సాంప్రదాయ సామూహిక నృత్యం

కోలాటం


కోలాట ప్రదర్శన

- ప్రాచీన ఆటపై పలువురి ఆసక్తి
- చిన్నారులకూ శిక్షణ
- ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న మహిళల ప్రదర్శనలు

నస్పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పండుగలు, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఇప్పుడు కోలాటం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మహిళలు ఎంతో సాంప్రదాయబద్ధంగా ఒకే రంగు చీరలు కట్టుకుని కోలాటాల్లో పాల్గొంటు ఆకట్టుకుంటున్నారు. కోలాటం చాలా ప్రాచీన మైన సంప్రదాయ సామూహిక నృత్యం. ఎక్కువ శాతం ముఖ్యంగా ఉత్సవాల సమయంలో ఈ కళని ప్రదర్శిస్తారు. మూరెడు పొడవు కలిగిన కర్రలను చేత పట్టి ఆడుతూ మహిళలు, పురుషులు పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యం చేస్తారు. జిల్లాలో వందకు పైగా బృందాలు సుమారు ఐదువేల మంది వరకు కోలాటం నేర్చుకుని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. జిల్లాలో ఉన్న కోలాట బృందాలకు రకరకాల నామకరణాలు చేసి బృందాలను ఆ పేర్లతో పిలు స్తుంటారు. పాఠశాలల్లో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల కోలాట ప్రదర్శనలుం టున్నాయి.

ఉత్సవాల సందర్భంగా కోలాట ప్రదర్శనలు

గణపతి నవరాత్రులు, దేవి నవరాత్రులు, బతుకమ్మ, అయ్యప్ప పడి పూజలు, ప్రత్యేక పూజల సందర్భంగా శోభాయాత్రలు, ఆలయాల్లో సాంస్కృతిక ప్రదర్శనల్లో కోలాటం ఆడుతున్నారు. భక్తి భావాన్ని పెంపొందిస్తూ ఉల్లాసాన్ని కలిగిచ్చే కోలాటంపై యువతులు దృష్టి సారించారు. ఆటు కోలాటంతో పాటు వ్యాయామం, ఆరోగ్య రక్షణకు దోహదం చేస్తుందని చాలా మంది మొగ్గుచూపుతున్నారు.

దీంతో కళా రూపాలతో పాటు కోలాట నృత్యం కూడా జీవితాల్లో పెనవేసుకుపోయింది. పెద్దల నుంచి పిల్లల వరకు అలరించే కళారూపం కోలాటం. రెండు చేతుల్లో చిన్న కర్రలను చేత పట్టి పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ లయబద్ధంగా అడుగులు వేస్తూ చేతి కర్రను మరొకరి చేతి కర్రను కొడుతూ ఆడతారు. ఇలాంటి ప్రాచీన ఆటలను భావితరాలకు పరిచయం, చిన్నారులకు శిక్షణ ఇప్పిస్తూ ముందుకు సాగుతున్నారు.

వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు..

గణపతి, దుర్గా నవరాత్రులు, బతుకమ్మ ఉత్సవాల్లో రంగు రంగుల చీరలను ధరించి కోలాటం అడుతూ మహిళల సందడి కనిపిస్తోంది. తిరుమల బ్రహ్మోత్స వాలు, లక్ష దీపోత్సవం, భద్రాచలం, ధర్మపురి, స్వర్ణగిరి, యాదగిరి గుట్ట, ఆలయాల ఉత్సవాల్లో చాలా మంది మహిళలు కోలాట ప్రదర్శనలో పాల్గొ న్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కోలాట ప్రదర్శనలు కళాకారులు ప్రశంసలు అందుకున్నారు. చాలా మంది మహి ళలు, పురుషులు కోలాటం నేర్చుకునేందుకు ఆసక్తి కన బర్చుతు న్నారు. బెల్లంపల్లిలో కొత్తగా కొలాట సభ్యుల బృందం తయారువుతోంది.


ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు



ఆసక్తి ఉన్న సభ్యులను తయారు చేస్తాం

మంజుభాషిణి- మంచిర్యాల

జిల్లాలో కోలాటం నేర్చుకునే సభ్యులను సంఖ్య పెం చడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. ఇదివరకు చాలా మంది సభ్యులకు దాసా ప్రాజెక్టు ద్వారా తిరుమలలో గుర్తింపు కార్డులు ఇప్పించాము. ఇంకా కొన్ని బృందాల సభ్యులు నేర్చుకుంటున్నారు. బెల్లంపల్లిలో కొత్త బృందం తయారు చేశాము. శ్రీ గోదారంగనాథ కోలాట బృందం ద్వారా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన కళా ప్రదర్శనల్లో పాల్గొన్నాం. నస్పూర్‌లోని నాగార్జున కాల నీ మైదానంలో 1008 మందితో భగవత్ బంధువులతో కూర్చుండి కోలాట ప్రదర్శన నిర్వహించాము.



ఆరోగ్యానికి ఎంతో మేలు

కనక తార- నస్పూర్

కోలాటం ప్రదర్శన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మంచి వ్యాయామం, కోలాటం భక్తి భావం పెంపొందిస్తుంది. చిన్నారులకు నేర్పిస్తే భావితరాలకు అం దించినవారమవుతాము. తిరుమల, యాదాద్రి, ధర్మపురి, వేములవాడ, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొన్నాము.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దండేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉంటేనే వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చునని దండేపల్లి మండల ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ సతీష్ అన్నారు. శనివారం దండేపల్లి పిహెచ్‌సీ పరిధిలోని నంబాలలో జ్వరం నివారణ కోసం వైద్య సిబ్బందిచే ప్రత్యేక చర్యలతో పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి 150 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 100 పైగా ఇంటింటికీ వెళ్లి జర్వంపై సర్వే చేపట్టి డెంగ్యూ, మలేరియా వైద్య పరీక్షలు చేపట్టారు. జర్వం పీడితుల ఇండ్లను సర్వే చేసి వారి ఇండ్లలో సానిటేషన్, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై వివరించారు. దోమల నివారణపై మలాథియాన్ ఫాగంగ్ అంటి లార్వల్ బైలెక్స్ స్ప్రే చేశామన్నారు.

అనంతరం దోమల నివారణకు పిచికారి స్ప్రే చేయించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సబ్ యూనిట్ అధికారి నాదేవ్ సిహెచ్‌వో పోసని, ఎంటిఎస్ సంతోష్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి డాక్టర్ మారుతీ, హెల్త్ అసిస్టెంట్ రమణ, కృష్ణవేణి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ ,వైద్యా సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


నంబాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న అధికారులు, వైద్య సిబ్బంది


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

ఎస్టీపీపీ నుంచి పవర్ మేక్ కంపెనీని తొలగించాలి

జైపూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న పవర్ మేక్ కంపెనీ తొలగించి ఆ కం పెనీపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ వైస్ ప్రెసిడెంట్ తిప్పారపు సారయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎస్టీపీపీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పవర్ ప్రాజెక్టులో గత నాలుగు నెలల క్రితం పవర్ మేక్ కంపెనీ ఆధ్వర్యంలో షట్‌డౌన్ పనులు సరైన విధంగా నిర్వహిం చకపోవడం వల్ల పవర్ ప్లాంటుకు కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. పవర్ మేక్ కంపెనీ అవగాహన రాహిత్యం వల్ల బాటమ్‌యాష్ కుప్పకూలే పరిస్థితి ఉందన్నారు. ప్రతి రోజు 700 మంది మ్యాన్ పవర్‌తో షట్‌డౌన్ పనులు నిర్వహించి ఆపరేషన్, మెయింటనెన్స్ చేయడంలో పవర్ మేక్ కంపెనీ విఫల మైందన్నారు. అను భవం లేని పవర్ మేక్ కంపెనీకి సంబంధించి పది మంది హెచ్‌డీవోలకు వేతనం చెల్లిస్తుందన్నారు. పవర్ మేక్ కంపెనీ నిర్వాకం వల్లనే పనిస్థలాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు.

షట్ డౌన్ జరిగి నాలుగు నెలలు కాక ముందే బాటమ్ యాస్‌లో వేసిన కోట్ల రూపాయల విలువ గల డోర్ ఇంక్లూజర్ స్పీడ్ గేట్, కాపర్ పరికరాలు ధ్వంసమయ్యాయన్నారు. నాసిరకం పనుల వల్లనే సంస్థకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. సింగరేణి సీఎండీ స్పందించి ఉత్పత్తి ఆటంకాలకు ప్రమాదాలకు కారణమైన పవర్ మేక్ కంపెనీ నుంచి జరిగిన నష్టాన్ని రివకరీ చేసి కాంట్రాక్టు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాయకులు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి జీఎంపై ఏసీపీకి ఫిర్యాదు

మందమర్రిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ తనను అవమానపర్చి దుర్భాషలాడాడని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ గుర్తింపు సంఘం బెల్లం పల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ శనివారం బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఓ కార్మికుడి సమస్యపై మాట్లాడేందుకు జీఎం వద్దకు వెళ్లానని తన వెంట మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణతో కలిసి శాంతిఖని పోస్టింగ్ ఇచ్చిన ఉద్యోగికి కాసిపేట 1, 2 గనులకు పోస్టింగ్ ఇవ్వాలని జీఎంను అడిగామన్నారు. దీంతో తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. జీఎంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తెలిపారు. జాతీయ కమిషన్ ఢిల్లీకి, తెలంగాణ ఎస్సీ కమిషన్ హైద్రాబాద్‌కు, సింగరేణి సీఎండీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పెన్షన్లు విడుదల చేయాలి

నస్పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఇచ్చే పెన్షన్లు ఫిబ్రవరి నెలకు సంబంధించిన పెన్షన్‌ను తక్షణమే విడుదల చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీ య నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటవ తేది నాటికి అందాల్సిన పెన్షన్లు ఇంకా రాలేదని, ఆలస్యం అయ్యే పరిస్థితి ఉన్నదని అధికారుల చెబుతున్నారన్నారు. పెన్షన్లు అందకపోవడంతో లబ్దిదారులు ఇబ్బందులు పడుతున్నరని, ప్రభుత్వం వెంటనే పెన్షన్ల కొరకు నిధులు విడుదల చేయాలని కోరారు.

బుగ్గ రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

బెల్లంపల్లిరూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లి మండలంలోని కన్నాల శ్రీ బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుగ్గ జాతర ఆదాయం రూ. 11,39,369 సమకూరినట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. శనివారం ఆలయం ఆవరణలో హుండీలను లెక్కించారు. అభిషేకం ద్వారా రూ. 40,200, బహిరంగ వేలం ద్వారా రూ. 3,73,000, దర్శనం టికెట్ ద్వారా రూ. 2,92,600, కళ్యాణ కట్నాలు రూ. 16,240, హుండీ ఆదాయం రూ. 4,17,329 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

దండేపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం రాజుగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కుంటాలగూడ కట్ట గిరిజన పాఠశాల చుట్టు ప్రహరీ గోడకు శనివారం ఈజీఎస్ అధికారులు స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. సుమారు 10లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి కుంటాల గూడ కట్ట పాఠశాల ప్రహరీ గోడకు నిధులు మంజూరు చేయగా, గోడ నిర్మాణం కోసం భూమి చేశారు.

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యుడు శంకర్, ఈజీఎస్ టిఏ జగన్, రామ్‌కుమార్, స్థానిక నాయకులు కంది సతీష్, లక్ష్మన్, చంద్రయ్య బీమయ్య, మహేష్, రామయ్యలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

శ్రీరాంపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా ఏజీఎం(ఫైనాన్స్)గా పనిచేసి ఎస్‌టీపీపీకి బది లీపై వెళ్తున్న మురళీధర్‌ను జీఎం ఎం. శ్రీనివాస్ నేతృత్వంలో ఘనంగా సన్మానించారు. ఏరియాలో ఆయ న చేసిన సేవలను కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, డీజీఎంలు చిరంజీవులు, ఆనంద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరుల త్యాగాలు మరువలేనివి

- వర్గీకరణ లోపాలను సవరించాలి
- 6న మంచిర్యాలకు మందకృష్ణ రాక
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య మాదిగ

మందమర్రి టౌన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలని,మూడు దశాబ్దాలుగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో జరిగిన ఉద్యమంలో ఎంతో మంది మాదిగ వీరులు అమరులయ్యారని, వారి త్యాగం మరువ లేనిదని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూర్ సమ్మయ్య మాదిగ, మండల ఇన్‌చార్జి జీడీ సారంగం మాదిగలు పేర్కొన్నా రు. శనివారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ లేకపోవడం మూలంగా ఎస్సీలోని మాల మినహాస్తే 58 ఉపకులాలు తీవ్రంగా నష్టపోవడం జరుగు తుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అనేక పోరాటాలు జరిగాయన్నారు. ఒక్కొక్క పోరాటం సందర్భంలో సహనం కోల్పోయినటు వంటి ఉద్యమ నాయకులు ఒక్కో సందర్భంలో ప్రాణ త్యాగాలు చేసు కున్నారని తెలిపారు. ఆ కుటుంబాలకు ఎమ్మార్పిఎస్ అధ్యక్షులుతో పాటు మాదిగ సమాజం అండగా నిలిచిందన్నారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘపోరాట చరిత్రను అర్థం చేసుకున్నటువంటి దేశంలోనే అత్యున్న త న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆరుగురి ధర్మాశనంతో వర్గీకణను అనుకూల తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ తీర్పును అమలు చేయాలంటూ ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ప్ర భుత్వాలపై సైతం ఒత్తిడి తెచ్చారని అన్నారు. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం కూడ ఎస్సీ వర్గీకరణకు ఏక సభ్య కమిషన్ వేసి అమలు చేసిందని పేర్కొన్నారు. ఇదంత కూడ అమరులతో పాటు ఉద్యమ పోరాట ఫలితమే అని చెప్పారు.

అనంతరం అమరుల ఫ్లెక్సీ పెట్టి ని వాళులు అర్పించారు. ఈ సమావేశంలో నాయకులు సిహెచ్. రాజు కుమార్, రాం శ్రీనివాస్, టి. జంపయ్య, సప్పి డి శ్రీనివాస్, రత్నం మొగిలి, మధునయ్య, కె. కుమార్, వి.రాజారాం, నందిపాట రవి, కె. రాజేందర్ మాదిగలు పాల్గొన్నారు.

రాయితీతో మోక్షం లభించేనా...?

(5వ పేజీ తరువాయి)

అవన్ని క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ ఖజాన నిండనుంది. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే మున్సిపాలిటీలకు ఆయా ప్రాంతాలను బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి దీని విలువ మ రింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాట్ మా ర్కెట్ విలువలో 14శాతం వసూలు చేయనున్నారు. అందులో ప్రభుత్వం ప్రకటించిన విధంగా 25శాతం రాయితీ ఇచ్చిన పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణ కారణంగా రూ. వందల కోట్ల ఆదాయం సమకూరే అవకాశాలు ఉన్నాయి.

● మరికొంత సమయం పట్టే అవకాశం..

ప్రభుత్వం లే అవుట్‌లేని వెంచర్లకు క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించినప్పటికీ ఆ ప్రక్రియ అమలుకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రభుత్వ ప్రకటనతో దరఖాస్తు దారులు ప్లాట్ల క్రమబద్ధీకర ణకు ముందుకు వస్తున్నప్పటికీ , ఈ విషయంలో ఇప్పటి వరకు సబ్ రిజిస్ట్రార్‌లకు ప్రభుత్వం నుంచి ఎ లాంటి స్పష్టత లేదని సమాచారం. ప్రభుత్వం సరైన ఆదేశాలు వస్తే తప్ప రిజిస్ట్రేషన్‌లకు ఆస్కారమే లేదు. ప్రభుత్వం ప్రకటించి దాదాపు 15రోజులు గడవ డంతో వినియోగదారులు గంపెడు ఆశతో నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా తమకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని, దీంతో తాము ఇప్పటికిప్పుడు రిజిస్ట్రేషన్‌లు చేసే అవకాశాలు లేవని, ప్రభుత్వ ప్రకటన మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు మరో రెండు నెలలైనా పడుతుందని సబ్ రిజిస్ట్రార్‌లు చెబుతున్నట్లు పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం అనధికార లే అ వుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ముందుకు వచ్చినందున, త్వరితగతిన విధివిదానాలు పూర్తి చేసి ఆ ప్రక్రియను అమలు చేయాలనే విజ్ఞప్తులు ఉన్నాయి.

చిరస్మరణీయుడు తాళ్లపల్లి కొమురయ్య

శ్రీరాంపూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు తాళ్లపల్లి కొమురయ్య చిరస్మరణీయుడని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు పేర్కొన్నారు. ఆయన వర్ధంతికి సంబంధించిన పోస్టర్లు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, ఈ నెల 4వ తేదీన సాయంత్రం 5 గంటలకు కొమురయ్య 16వ వర్ధంతిని నిర్వహించనున్నట్లు చెప్పారు. శ్రీరాంపూర్‌లోని భాను టేలా సెంటర్ వద్ద కార్యక్రమం ఉంటుందని, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, లింగం రవి, శ్రీరాంపూర్ శాఖ కార్యదర్శి పూజారి రామన్న, నాయకులు దొడ్డిపట్ల రవీందర్, బొడ్డు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌తో శాస్త్రీయ దృక్పథం పెరుగుతుంది

చెన్నూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ ఎగ్జిబిషన్‌తో విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెరుగుతుందని ఎంఈవో రాధాకృష్ణమూర్తి అన్నారు. శనివారం పట్టణంలోని అబ్యాస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్నివాల్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్నివాల్‌లో విద్యార్థులు 30 ప్రాజెక్టులు ప్రదర్శించడం అభినంద నీయమన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు సాంకేతికతను అలవర్చుకుంటే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్‌మూల రాజిరెడ్డి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కారెంగుల రామయ్య, కరెస్పాండెంట్ శ్యాం సుందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సురేష్, పాల్గొన్నారు.

పేదింటి బిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం


డబ్బులు, పెళ్లి దుస్తులు అందజేస్తున్న బండి సదానందం యాదవ్

మందమర్రి టౌన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హిందుగార్డెన్ ఏరియాకు చెందిన కూకట్ల పోచం-మల్లేశం కూతురు అంజలి వివాహం ఈ నెల 9న జరుగనుంది. పేదింటి కుటుంబం కావడంతో పెళ్లి ఖర్చులు, డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న అఖిలభారత యాదవ సంఘం, జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ అండగా నిలిచారు. శనివారం రూ.50వేల నగదు ఆర్థిక సాయంతో పాటు పెళ్లి బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి రవి

చెన్నూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు జూనియర్ మున్సిఫ్ కోర్టులో ఈ నెల 8న లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు జడ్జి పి. రవి తెలిపారు. శనివారం కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన కో ఆర్డినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, డ్రంకెన్ డ్రైవ్ తదితర కేసులు పరిష్కరించబడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యుడు మల్లేశం, జూనియర్ అడ్వకేట్ పూనం నాగులు, చెన్నూరు, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, ఎస్ఐలు, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

ప్రజా సేవతోనే పద్మవిభూషణ్ అవార్డు

మందమర్రిటౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ పద్మవిభూషణ్ నాగేశ్వర్ రెడ్డిని శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షిచారు.


ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

- 'ఉపాధి'లో క్షేత్ర సహాయకులు కరువు
- జిల్లాలో 335 పంచాయతీలకు 160 మంది సిబ్బంది
- కొత్త పంచాయతీల్లో నియామకంపై చర్యలు కరువు

కొలతలు తీసేదెలా.. రికార్డు చేసేదెలా?

కూలీల వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకంలో క్షేత్ర సహాయకుల నియామకం లేక పోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల కొలతలు, రికార్డులు చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.


ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో వివరాలు..

జాబ్ కార్డులు: 1,23,505	కూలీలు: 2,44,312
క్రియాశీలకంగా ఉన్న కార్డులు: 92,833	క్రియాశీలకంగా ఉన్న కూలీలు: 1,70,303
మొత్తం గ్రామపంచాయతీలు: 335	
క్షేత్ర సహాయకులు లేని గ్రామపంచాయతీలు: 175	

బెజ్జూరు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసలు నివారిస్తూ ఉపాధితో పాటు అన్నదాతలకు చేయూత అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఏటా వేసవిలో వ్యవసాయ పనులు తక్కువగా ఉండడంతో ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరవుతుంటారు. కొత్తగా ఏర్పడ్డ పంచాయతీల్లో క్షేత్ర సహాయకులను నియమించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త పంచాయతీలు ఏర్పడి దాదాపు పదేళ్ల దగ్గర పడుతున్నా ఇప్పటికీ ఆ పంచాయతీల్లో నియామకం లేకపోవడంతో ఉన్న క్షేత్ర సహాయకులే రెండు, మూడు పంచాయతీలకు పనులు చూడటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

• వారే కీలకం

గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడం, మస్టర్ల కేటాయింపు, పనుల పర్యవేక్షణ, జాబ్ కార్డుల మంజూరు, అధార్ అనుసంధానం, కూలీలకు వసతి ఏర్పాటు వంటి పనులను క్షేత్ర సహాయకులే పని చేస్తున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 335పంచాయతీలున్నాయి. వీటిలో 160మంది క్షేత్ర సహాయకులు పని చేస్తున్నారు. జిల్లాలో కొత్తగా 175పంచాయతీలు ఏర్పడ్డాయి. కానీ క్షేత్ర సహాయకులను మాత్రం నియమించలేదు. దీంతో అనుభవం ఉన్న కూలీలను మేట్‌గా గుర్తించి పనులు చేయించే బాధ్యత అప్పగిస్తున్నారు. ఇలా కొందరు క్షేత్ర సహాయకులు అదనపు గ్రామాల ఉపాధి పనుల బాధ్యతలను చూసుకోవాల్సి వస్తోంది.

• పర్యవేక్షణ కొరవడి..

క్షేత్ర సహాయకులు అన్ని చోట్ల లేక పోవడంతో ఉపాధిహామీ పనుల్లో పర్యవేక్షణ కొరవడుతోంది. మేట్‌లు చురుకైన వారు లేనిచోట్ల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి పనుల బాధ్యత చూసుకుంటున్నారు. దీంతో వారు సర్పంచులు లేక సర్వేలు, పంచాయతీ పనులతో పాటు ఉపాధి పనులపై దృష్టి సారించలేక పోతున్నారు. మేట్‌లు ఎలాంటి తప్పిదాలు చేసినా క్షేత్ర సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యులు కావాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వారికి పూర్తిస్థాయి బాధ్యతలు లేకపోవడంతో ఉపాధి పనుల్లో పురోగతి లేకుండా పోతోందని ప్రజలు పేర్కొంటున్నారు. గ్రామాలకు కొత్త పనులు కేటాయించడం, ఉపాధి గ్రామసభలు నిర్వహించడం, హాజరు నమోదు, కూలీలకు వేతనాలు మంజూరు వంటి విషయాల్లో పర్యవేక్షణ కొరవడుతోంది. దీంతో సరైన సమయానికి కూలీ డబ్బులు జమ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. జాబ్ కార్డుకు వంద రోజుల పనులు కల్పించడంలో విఫలం అవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

ఆదేశాలు వస్తే నియమిస్తాం..

– దత్తారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

కొత్తగా ఏర్పాటైన గ్రామ పంచాయతీలకు క్షేత్ర సహాయకుల నియామకాలకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వస్తే వెంటనే నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి పనుల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య తలెత్తకుండా ఉండేందుకు కొందరికి అదనపు బాధ్యతలు కూడా అప్పగించాం.

మహిళలు, పిల్లల రక్షణకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్న పిల్లల రక్షణే పోలీసుల తొలి ప్రాధాన్యమని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, యువతులు హింసకు గురి అయి నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదిచవచ్చన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం షీ టీం, యాంటి ఉమెన్ ట్రాకింగ్ టీం, భరోసా సెంటర్లు పని చేస్తున్నాయని చెప్పారు. మహిళలు, విద్యార్థినులు అన్యాయానికి గురైనప్పుడు భయ పడొద్దన్నారు. ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటా మన్నారు. కళాశాలు, పాఠశాలల విద్యార్థులకు ర్యాంగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై షీటీం, భరోసా సెంటర్ టీం, సంబంధిత పోలీసు స్టేషన్ అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పని చేస్తున్నాయన్నారు. మహిళలకు ఎదైన ఇబ్బంది తలెత్తితే ఆసిఫాబాద్ డివిజన్(8712670564), కాగజ్‌నగర్ షీ టీం (8712670565) లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంతా వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి మార్చి 1 నుంచి 31 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, బహిరంగ సభలు తదితర ప్రజలు గుమికూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరా దన్నారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండకూడదని చెప్పారు. ప్రజా జనజీవ నానికి ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారి తీసే ఇబ్బందకర ప్రజా సమావేశాలు,జన సమూహం లాంటివి పూర్తిగా నిషేదం అన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమన్నారు. ప్రచార రథాలు, మైకులు, తదితర అధిక శబ్ద పరికరాలు నిషేధించామని తెలిపారు.

బ్యాంకుల్లో భద్రత ఏర్పాటు చేసుకోవాలి

ఆసిఫాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లోని అన్ని బ్యాంకుల అధికారులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పలు ప్రాంతాల్లో బ్యాంకుల్లో చోరీలు జరిగాయని అన్నారు. అలాంటి సంఘట నలు డివిజన్‌లో జరగకుండా అధికారులు తమ బ్యాంకులకు సంబంధించి పకడ్బందీగా భద్రత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో సీఐలు రవీందర్, రమేష్, సత్యనారాయణ, ఎస్సైలు చంద్రశేఖర్, సాగర్, శ్రీకాంత్, విజయ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వాలి

కాగజ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 2, 15వ వార్డులో మిషన్ భగీరథ పైపులైను కనెక్షన్ ఇవ్వాలని శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బాల్క శ్యాం మాట్లాడుతూ మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వక పోవడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎండలు పెరుగుతున్నందున తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వాలని కోరారు. మాజీ కౌన్సిలర్ వెంట కాలనీవాసులు ఉన్నారు.

విద్యార్థులు భయం వీడాలి

సిర్పూర్(టి), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయ పడకుండా విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలని జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆసీఫ్ అలీ అన్నారు. శనివారం ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్‌లు అందజేశారు. హాల్ టికెట్లు రాని వారు ఆన్‌లైన్ ద్వారా కూడా డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

పర్యటించి.. విజ్ఞానం పొంది..


రామప్ప దేవాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

పెంచికలపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పెంచిక లపేట మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రైమినిస్టర్ స్కూల్ ఆఫ్ రైసింగ్ ఇండియా క్షేత్ర పర్యటనలో భాగంగా పలు చోట్ల పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. శనివారం రామన్న దేవాలయం, లక్నవరం చెరువు, వరంగల్ లోని భద్రకాళి దేవస్థానం, వేయిస్తంభాల గుడిని సందర్శించారు. కాకతీయ రాజుల కళావైభవం, కట్టడాలు, వారి పాలన, దేవాలయాలు, శిల్పకళా నైపుణ్యం, కాకతీయుల పాలన దక్షితపై విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, యాదగిరి, బడేసాహెబ్, లక్ష్మి, సంతోష్, భారతి, ఆఫ్తాబ్, ధనరాజ్, ఆత్మారాం, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న రాస్పెల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పీఎంశ్రీ క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జులాజికల్ పార్కు, బిర్లామందిర్, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మి నార్, గోల్కొండ, చారిత్రాత్మక ప్రదే శాలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివమల్లన్న ఆలయ హుండీలు లెక్కింపు

కాగజ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈసుగాం శివమల్లన్న ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని శనివారం ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా తెలిపారు. బహిరంగ వేలం ద్వారా రూ.11,01,500, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,94,450, హుండీల ద్వారా రూ.5,55,368 ఆదాయం వచ్చిందని చెప్పారు. మొత్తం రూ.21,51,318 ఆదాయం వచ్చిందని తెలిపారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి

వాంకిడి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సైన్స్ పితామహుడు సీవీ రామన్ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను ఎంఈవో శివచరణ్ కుమార్ తిలకించి ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

వాంకిడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చైర్మన్ ఐఏఎస్ నరహరి జన్మదినం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి కోట్నాక విజయ్‌కుమార్, సభ్యులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్‌లో గడబిడ..

» డీసీసీకి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మధ్య విభేదాలు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్‌లో గ్రూపు విభేదాలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ అంటేనే గ్రూపులు ఉండడంతో పాటు నాయకులు స్వేచ్ఛగా మాట్లాడుకునే ప్రజాస్వామ్యం ఉంటుందనే బయట అందరు అనుకునేది. అయితే దానికి కొనసాగింపుగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నాయకులతో పాటు కార్యకర్తలు కూడా గ్రూపులుగా ఏర్పడడంతో పాటు బహిరంగంగానే ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా దీని ప్రభావం కనిపించినట్లు తెలుస్తోంది.

● అసెంబ్లీ ఎన్నికల అనంతరం

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన శ్యాంనాయక్ ఓటమి అనంతరం విభేదాలు బయటకు వస్తున్నాయి. తన ఓటమికి కారణం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షు డు అని బహిరంగంగానే విమర్శించడంతో గొడవ తారాస్థాయికి చేరింది. గత నవంబరు 2న నిర్వహించిన కులగణన సందర్భంగా ఇరువర్గాలు దాడులు చేసుకున్నాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకు న్నాయి. ఇటీవల శ్యాంనాయక్ చేసి న ఫిర్యాదుతో డీసీసీతో పాటు మరో నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు కావడంతో ఈ గొడవ చిలికి చిలికి గాలి వానలా తయారైంది.

● రాష్ట్ర నేతల అండతో..

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అభ్యర్థిగా సరస్వతి కొంత ప్రచారంలోకి వచ్చినప్పటికీ ఎన్నికల సమయంలో శ్యాంనాయక్ పార్టీ రాష్ట్ర నేతలతో మాట్లాడి టికెట్ తెచ్చుకున్నారు. దీంతో సరస్వతి కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు శ్యాంనాయక్‌కు మద్దతు తెలపడంతో ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చాడు. త్వరగా ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌లో చేరడంతో పాటు శ్యాంనాయక్ ఓటమి కోసం పని చేశారని తనకు తెలిపినట్లు శ్యాంనాయక్ బహిరంగంగా విమర్శించారు. అప్పటి నుంచి వారిద్దరి మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం ఇద్దరు నాయకులు ప్రత్యేక వర్గాలను తయారు చేసుకు న్నారు. నియోజక వర్గంలో కాంగ్రెస్ నాయకుల విభేదాలు తారాస్థాయికి చేరడంతో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీపై దాని ప్రభావం కనిపించినట్లు స్థానికంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

● కార్యకర్తల్లో ఆయోమయం..

జిల్లాలో ఇంత జరుగుతున్నప్పటికీ రాష్ట్ర నాయకత్వం స్పందించక పోవడంతో పార్టీ పరిస్థితి రానున్న రోజుల్లో ఏ విధంగా ఉంటుందోనని కార్యకర్తల్లో ఆయోమయం నెలకొంది. రెండు నెలల క్రితం నియోజకవర్గానికి మంజూ రైన నిధుల్లో కూడా డీసీసీ వర్గానికి కొంత, నియోజకవర్గ ఇన్‌చార్జికి కొంత కేటాయించడంతో మరింత ఆందోళన నెలకొంది. కాంగ్రెస్‌లో నాయకులకు స్వేచ్ఛ ఉన్నా పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించినందుకు తాజాగా తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై నియోజకవర్గ నాయకులు కూడా చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో కూడా పార్టీ పరిస్థితిని చక్కదిద్దే విధంగా రాష్ట్ర నాయకత్వం చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ మరింత నష్ట పోయే అవకాశం ఉంటుందని వాపోతున్నారు. రాష్ట్ర నాయకత్వం దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని పార్టీ వర్గాలు కోరుతున్నారు.

విద్యార్థులు సమయం వృథా చేయొద్దు


వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించాలని శ్రీవిశ్వ శాంతి హైస్కూల్ కరస్పాండెంట్ లంక కృష్ణప్రసాద్ అన్నారు. కాగజ్‌నగర్ శ్రీ విశ్వ శాంతి హైస్కూల్‌లో శనివారం పది విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది వార్షిక పరీక్షు సమీపిస్తుండటంతో విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): కష్ట పడి చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో సునీత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం రాత్రి పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత శిఖరాలను అరోధించాలని సూచించారు. రానున్న రోజుల్లో చదువుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వో అరుణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

కాగజ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకనంద డిగ్రీ కళాశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ హనుక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఎస్సై సందీప్‌కుమార్ శనివారం బాధితుడికి అందజేశారు. కాగజ్‌నగర్ మండలం బురదగూడకు చెందిన శేఖర్ వారం రోజుల క్రితం తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు దాన్ని ట్రేస్‌చేసి శేఖర్‌కు రూరల్ ఎస్సై సందీప్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వాంకిడి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి. ప్రిన్సిపాల్ చంద్రయ్య మాట్లాడుతూ ఐదో తేదీ నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ప్రణాళికతో పరీక్ష హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, కిరణ్, శ్రీధర్, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

తాగునీరు రాక ఇబ్బందులు

ఆసిఫాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవాడ, బెస్తవాడలలో 15 రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రాక పోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకుడు కాంద్రె విశాల్ అన్నారు. శనివారం కాలనీ వాసులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏకలవ్య గురుకుల పాఠశాల మంజూరు చేయాలి

సిర్పూర్(యు), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(యు) మండలానికి ఏకలవ్య గురుకుల పాఠశాల మంజూరు చేయలని మండల వీటీడీఏ చైర్మన్ కుమ్ర భీంరావు ఎంపీ గోడం నగేష్‌ను కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ గోడం నగేష్ నివాసంలో శనివారం కలిసి వినతి పత్రం అందించారు. సిర్పూర్(యు) మారుమూల మండలం కావడంతో విద్యా పరంగా అభివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకలవ్య గురుకుల పాఠశాల ఏర్పాటుకు కావాల్సిన భూమి మండలంలో అందుబాటులో ఉందని చెప్పారు. భూమికి సంబంధించిన పత్రాలు ఎంపీ గోడం నగేష్‌కు అందజేశారు. ఎంపీ మండలానికి ఏకలవ్య గురుకుల పాఠశాల మంజూరుకు హామీ ఇచ్చారని కుమ్ర భీంరావు తెలిపారు.